


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 14 పుష్పం : 37-39 05-04-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16
**VOL : 7** **ISSUE : 14**
EDITOR
**P.S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## మతిని బాగుచేసేదే నిజమైన మతం

ప్రకృతి-పురుషుడు-ఈశ్వరుడు- ఈ అంశాల ప్రాతిపదిక మీదనే ప్రతీ మతం ఏర్పడుతున్నది. ప్రతీ మతంలోనూ, తాత్త్వికదర్శనం - పురాణం - కర్మకాండ అనే మూడు ముఖ్య భాగాలు ఉంటాయి. 1. తాత్త్విక దర్శనం లేని మతాలు నిలబడవు. విద్వాంసులు, జిజ్ఞాసువులు, తాత్త్విక దర్శనంతో సంతృప్తి పడతారు. అది అవసరం. మన గమ్యం ఆత్మానుభవమే కాబట్టి. 2. రసపిపాసకులకు పురాణాలు అవసరం. ఆ అవతారపురుషుని కళ్యాణ గుణాలను మననం చేసుకొని మినహాయింపులు లేకుండా నిండు మనస్సుతో ప్రేమించినా గమ్యాన్ని చేరవచ్చు కాని గాధలే ముఖ్యం అనుకొంటే, అగాధాల్లోకి కూరుకుపోతారు. 3. కర్మకాండ యిది సామాన్య జనులకోసం. చివరి రెండు భాగాలు ఆయాదేశ, కాలమానాలకు అనుగుణంగా రూపొందినవే. అవతారపురుషులు అందరూ "సత్యానికి ప్రాతినిధ్యం వహించినవారే. ఈ మతాలన్నీ గాఢనిద్రలో లేవు. "సత్యం" ఒక కాలానికి, ఒక రూపానికి, ఒక నామానికి, పరిమితమైలేదు. సత్యానికి చాటింపు అక్కరలేదు. "అదిగా ఉండటం వల్లనే" అది తెలియబడుతుంది. మతం అంటే జీవన విధానం. ఏ అవతారపురుషుడు స్ఫురించినా మనలో పులకరింపురాకపోతే అజ్ఞానంలో ఉన్నట్లే. కాని ఆయా మతాల్లో ఉండే అంశాలే నిజమని, వాటికే పరిమితమైన వారు ఇతరమతాల అంశాలను వ్యతిరేకించటం వల్ల ఘర్షణవస్తున్నది, సత్యానికి దూరమవుతున్నారు. అట్టి అల్ప-స్వల్ప భావాలుగలబుద్ధి గలవారు సభ్య సమాజానికి అశాంతిని పంచిపెడుతూ ఉన్నారు. రక్తపాతాన్ని కలిగించే అజ్ఞాన జనితమైన వారి చేష్టలు ఎలా ఉన్నాయి అంటే అద్దాలగదిలో ప్రవేశించిన పిచ్చుక, లేదా సునకం, అందు తనకన్న భిన్నముగా ఎన్నోరూపాలు ఉన్నాయని భ్రమించి, పొడుచుకొని, అరుచుకొని, ఆయాసపడే దయనీయ స్థితిలో ఉన్నట్లు ఉన్నారు. కాని, ఈశావాస్యమిదగ్ం సర్వం" అన్న ఉపనిషత్ వాక్యం గాని "స్వర్గరాజ్యంనీలోనేఉంది" అన్న యేసువాణిగాని "లా యిల్లా - ఇల్లి లాహో" అన్న ఖురాన్ సందేశంలోని, ఏకత్వభావాలు, సమన్వయం సాధించలేక "ఆమెన్" కు "ఓం" కారానికి, ఉన్న దగ్గర సంబంధం గుర్తించలేక, మతమౌఢ్యంలోనే అలమటిస్తున్నారు. క్రీస్తు - కృష్ణుడు - బుద్ధుడు, ప్రజలను, సంస్కరించటానికి, చెయ్యవలసింది అంతాచేసారు. కానిమానవ మానసం ఎలా తయారైనదంటే - కుక్కతోకను లాగిపట్టుకొన్నంత వరకుసాపుగా ఉండి వదిలిన తక్షణం వంకరగా తయారైనట్లుఉంది. బంధస్వరూపాన్ని గ్రహించలేక, సామరస్యంగా జీవించలేక, నిజధామంలోని ఆనందసాగరాన్ని గుర్తించలేక, అశాంతితో అలమటిస్తున్నది. మహిమలు ప్రదర్శించేవారు శరీరరోగాలను తగ్గిస్తాము అనేవారు ఎక్కువైనారు. నేడు భవరోగ సంస్కర్తలు అహంకార విజయ పట్టబద్రులు కావాలి. తాత్త్విక దర్శనానికి, సహాయ సహకారాలు అందించే మహాత్ములు కావాలి. ప్రేమించే మాతృహృదయాన్ని వికశింపచేయటంలోనే ఉంది నిజమైన అనందం అనుకొనే ప్రియమూర్తులు కావాలి వారి వల్లనే లోకానికి శాంతి-సుఖము అందుతాయి.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
**అర్ధవరం**

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

28-02-2002 విస్సాకోడరు ........ 3
12-03-2002 చించినాడ ........ 8
13-03-2002 నేరేడుమిల్లి ........ 12

Visit us: www.srinannagaru.com

## రమణభాస్కర

### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-2-02, విస్సాకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అజ్ఞానంలో దుఃఖం ఉంది, అశాంతి ఉంది కాని జ్ఞానంలో సుఖం ఉంది, శాంతి ఉంది. అందుచేత మనం జ్ఞానసముపార్జనకు కృషి చేయవలసి ఉంది. ప్రతీ జన్మకూడా ఒక స్వప్నం. మనకు గాఢనిద్రలో చిన్నచిన్న స్వప్నాలు వస్తాయి, ఆగిపోతాయి. అలాగే అజ్ఞానమనే నిద్రలో ఒకోజన్మ ఒకో స్వప్నం వంటిది. ఆ స్వప్నంలో ఒక దేహం ధరించి కష్టసుఖాలు అనుభవించి, కొన్ని అనుభవాలు పొంది ఆదేహం పోతుంది, మరల కొత్తదేహం వస్తుంది. ఇవన్నీ అజ్ఞానమనే దీర్ఘనిద్రలో జరిగిపోతున్నాయి. మనం భక్తిపేరుమీద కోరికలు నెరవేర్చుకోవటంకాదు, భక్తిపేరుమీద ముక్తిని సాధించాలి అదిలక్ష్యం. భక్తిమార్గం చాలా సరళమైనది, సూటిఅయిన మార్గం. భక్తి వలన మన మనస్సుకు, బుద్ధికి చల్లదనం వస్తుంది. జీవితంలో ఏరంగంలో అయినా అభివృద్ధిలోనికి రావాలంటే ఏకాగ్రత, ప్రశాంతత ముఖ్యం. ఏపని అయినా ఏకాగ్రతతో చేయాలి, ప్రశాంతతతో చేయాలి. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఇవి రెండూ కాపాడుకొంటూ ఉంటే ఈ లోకంలో మనం సాధించేవి అన్నీ సాధించవచ్చు, ఆత్మవిద్యను కూడా పొందవచ్చు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని మన మనస్సులో ఉన్న మలం వలన ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నా ఆయన మనకు తెలియటం లేదు. భగవంతుడి యొక్క నామాన్ని శ్రద్ధగా జపించటంవలన మనస్సులో ఉన్న మలం పోతుంది. చేదుమాటలు మనలను అమృతం దగ్గరకు తీసుకొనివెళ్ళవు. అమృతంతో కూడిన మాటలు విన్నప్పుడు శరీరం చల్లబడుతుంది, మనస్సు చల్లబడుతుంది, ఆ మాటలు లోపల ఉన్న అమృతాన్ని అందుకోవటానికి సహకరిస్తాయి. కృష్ణుడు భగవద్గీత చెపితే ఈనాటికి కూడా అనేక మంది అధ్యయనం చేసి, అర్ధంచేసుకొని దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు, అది అమృతతుల్యమైన సందేశం, అది కాలానికి అతీతం. అందుచేత మన మాటలు చేదుగా ఉండకూడదు, మాటలు తియ్యగా ఉండాలి, అమృతంతో కూడి ఉండాలి. ఎన్ని శాస్త్రాలు చదివినా ఏమీలేదు మన మనస్సులో ఉన్న మలంను తొలగించుకోవాలి. ఏమార్గంలో ప్రయాణించినా మనస్సు పల్చబడాలి, మనస్సుకు ఏకాగ్రత రావాలి. ఈశ్వరుడు పట్ల పరిపూర్ణమైన విశ్వాసం కుదరాలి. సత్యవస్తువు మనకు అత్యంత సమీపంలో మన హృదయంలోనే ఉంది. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే ఉండటం. అది అనుభవంలోనికి వచ్చే వరకూ ఏదో రకమైన దుఃఖం, కొరత, వెలితి ఈ జీవుడిని ప్రతి జన్మలోనూ వెంటాడుతూ ఉంటాయి. ఒక్క జ్ఞాని మాత్రమే కర్మలో ఆకర్మను చూస్తాడు. నేను చేస్తున్నాను అనే కర్తృత్వబుద్ధితో





ఎన్ని మంచిపనులు చేసినా వారు మంచిలోకాలకు వెళ్ళవచ్చుగాని తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని సమాజఋణం తీర్చుకోవాలి ఎందుచేతనంటే సమాజరూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. అందుచేత మనంచేసే సత్కర్మకూడా గొప్పలకోసం కాకుండా నిర్మలంగా, నిశ్చలంగా చేయాలి. మనం చేసేపని వలన మనస్సులో ఉన్న మలం పోవాలి. ఒక రామభక్తుడు ఏమి చెప్పాడు అంటే రామనామం స్మరించటం వలన ప్రపంచంలో ఉన్న మలం పోతుంది ఇంక నీలోని మలం పోవటం ఎంత అన్నాడు అది రామనామం యొక్క వైభవం. రామాయణంలో చాలా మంచి మాటలు చెప్పాడు. లోకానికి సంబంధించిన మాటలు చెపుతూ మనం మోక్షానుభవం ఎలా పొందాలి అని దారి చూపిస్తూ ఉంటాడు. మనం కథ చెపుతున్నాడు అనుకొంటాము. ఆకథ నడిపిస్తూ మంచిమాటలు చెపుతూ లోపల మోక్షానుభవం పొందటానికి, రామానుగ్రహం అందుకోవటానికి ఎలా పనిచేయాలో వాల్మీకి చెపుతాడు. ప్రతీ మనిషి వాడి వాసనను బట్టి, వాడి సంస్కారమును బట్టి పనిచేస్తూ ఉంటాడు. అందుచేత వాసనా రహితస్థితి, సంస్కార రహితస్థితి పొందేవరకు మనకు చిత్తశాంతి కలుగదు. నిరంతరం భగవంతుని రూపాన్ని ధ్యానించటంవలన, నామాన్ని స్మరించటం వలన మనకు చిత్తశాంతి కలుగుతుంది. మనకు అనేక తలంపులు వస్తూ ఉంటాయి. అవి ఎక్కడ నుండి వస్తున్నాయి అంటే లోపల ఉన్న వాసనను బట్టి వస్తున్నాయి. అహంకారము అనేది ఈ దేహరూపంలో ఉంది, దానిని మర్చిపోతే ఏమీలేదు. స్తోత్రం చేస్తూ ఉంటే పొంగిపోయి, విమర్శిస్తూ ఉంటే కృంగిపోతూ ఉంటే దేహబుద్ధి బలంగా ఉంది అని అర్ధం. నీవు, నేను అనే భేదబుద్ధిని తొలగిస్తే, రూపాన్ని నామాన్ని తీసి ఒక ప్రక్కన పెడితే ఉన్నది అంతా బ్రహ్మమే. దేహమునేను అనే తలంపు వచ్చాక ఏదో సంపాదించాలి అనుకొంటాము, అక్కడ నుండి స్వార్ధం, రాగద్వేషములు వచ్చేస్తాయి. నేను వచ్చాక నాది వస్తుంది. ముందు అహంకారం తరువాత మమకారం. అహంకారం లేకుండా మమకారం రాదు. మీకు ఎన్ని ఉన్నా ఒక్క ఆత్మజ్ఞానం తప్పించి మిగిలినది అంతా స్వప్నసమానము. మీకు ధనం ఉన్నా, చదువు ఉన్నా గౌరవం ఉన్నా ఇది అంతా స్వప్నసమానము. ఇవి చూసుకొని గర్వం తెచ్చుకొంటే చివరకు సున్న. ఈ విషయాలను చూసి గర్వం తెచ్చుకొంటే మీలో ఉన్న మంచిబయటకు పోతుంది, బయట ఉన్న చెడ్డ మీలోపలకు వస్తుంది. మనం వినయసంపద పెంచుకొంటే మనలో ఉన్న దైవీ గుణాలు బయటకుపోవు, మనలోలేని దైవీగుణాలు మనకు అదనంగా వస్తాయి. మన అమ్మాయి కోడలుగా ఎక్కడికో వెళుతుంది, మనకు కోడలు ఎక్కడనుండో వస్తుంది. వచ్చిన కోడలు సుఖపెట్టేవారు ఉన్నారు, ఇంటిని నరకంలాగా చేసేవారు ఉన్నారు. ఈ సంఘటనలు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అనుకొంటాము. అది ఈశ్వరుని ప్రణాళిక. అది అర్ధంకాక ఉద్రేకపడతాము. మనకు లోచూపు కలిగితే, మనస్సు హృదయాకారం

చెందుతున్నప్పుడు పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనస్సుకు చలనం కలుగదు. అనుకూలంగా ఉన్నప్పుడు గర్వపడదు, ప్రతికూలంగా ఉన్నప్పుడు భంగపడదు. మిగిలిన విషయాలు అన్నీ మనకు అనవసరం. మన పాత్రను మనం నిర్వర్తిస్తూ, మన ధర్మం మనం నిర్వర్తిస్తూ ఉద్రేకపడకుండా మనం మోక్షానుభవం పొందటానికి, పునర్జన్మలేని స్థితిని పొందటానికి ప్రయత్నం చేయాలి. ప్రారబ్ధాన్ని బట్టి వచ్చేవి వస్తాయి, పోయేవి పోతాయి. ఒక కాలం సంపదను తీసుకొని వస్తుంది, ఒక కాలం తీసుకొని పోతుంది. ఇది అంతా దేహానికి, మనస్సుకు సంబంధించినది. పరమాత్మకు వీటితో ఎట్టి సంబంధం లేదు. ఈ లోకంలో మనస్సును ఆకర్షించే విషయాలు చాలా ఉన్నాయి. ఈలోకం నిజం అనుకోవటం వలన మనస్సు బాహ్యముఖానికి వెళుతూ ఉంటుంది. ఈలోకంలో ఏమీలేదు అని మనకు అర్థమయినప్పుడు మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు. గౌరవాలు, అగౌరవాలు అన్నీ స్వప్న సమానము. నీ మనస్సు మనోమూలంలో ఉన్న బ్రహ్మంవైపుకు జరుగుతూ ఉంటే దుఃఖ స్పర్శ కూడా నిన్ను అంటదు. మనలను మనం బాగుచేసుకోవటానికి నిరంతరం సాధన చేసుకొంటూ జీవించాలి. ఆహారం విషయంలో, నిద్ర విషయంలో, మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. అతిగా తినటం వలన మనస్సు ఆత్మను చింతించలేదు, దేహం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అతినిద్రవలన కాలం వృథా అవుతుంది. మనం మాట్లాడే మాటల వలన ఎదుటి వారికి చల్లదనం కలగాలి కాని క్షోభ కలుగకూడదు.

మనకు సంతోషం వచ్చినా మనస్సే, దుఃఖం వచ్చినా మనస్సే దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు ఎందుచేతనంటే అది నీవుకాదు. నిన్ను ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా దానిలో నుండి ప్లెజర్‌గాని, పెయిన్‌గాని తీసుకోవద్దు, సమానంగా ఉండు. పొగడ్తల నుండి ప్లెజర్ తీసుకొంటారు అనుకోండి దానిలోనుండి వికారం పుడుతుంది. ఈవికారములే మీ లోపల ఉన్న సహజస్థితికి మిమ్మల్ని దూరంచేస్తాయి. ఇది అర్థం చేసుకోండి. ఈ వికారములు లేకుండా ఉంటే మీలోపల ఉన్న సహజస్థితి మీకు వ్యక్తమవుతుంది. మానవ మనస్తత్వం ఎలా ఉంటుంది అంటే ఎదుటివాడు మనస్వార్థానికి ఉపయోగపడితే ఒకలాగ ఉంటాము, మన స్వార్థానికి ఉపయోగపడకపోతే మరోలాగ ఉంటాము. విశ్లేషణ లేకపోతే ఈ చిన్న విషయం కూడా మనకు అర్థం కాదు. మానవుడు స్వార్థం కేంద్రంగా పెట్టుకొని జీవిస్తాడు. స్వార్థం ఉన్నవాడు ఎన్ని తపస్సులు చేసిన వాడికి పరమార్థం అందదు. స్వార్థం కనీసం 50% తగ్గించుకొన్నా సమాజానికి ఎంతో ఉపయోగపడవచ్చు. మనం నేను, నేను అంటాము. ఇది ఒక బుల్లి నేను. ఇది నిజం కాదు. కాని మనం దానితో తాదాప్యం చెందటం వలన వేలాది జన్మలు దానితో కొట్టుకొని పోతున్నాము. ఈ బుల్లినేను ఏమి చెపుతుంది అంటే ఈ శరీరమే నువ్వు, ఈ మనస్సే నువ్వు అని చెపుతుంది. వాటిని ఆధారంగా పెట్టుకొని జీవిస్తూ అది వృద్ధి





అవుతుంది. అది నిజంకాదు, అది ఒక తలంపు మాత్రమే. ఇది మనకు అర్థంకాక, దానిలో నుండి విడిపోలేక చీకటిలో పడి ఉన్నాము. చైతన్యం ఒక మహా సముద్రం అయితే బుల్లి నేను అందులో వచ్చే ఒక తుంపరవంటిది, కనీసం బుడగ కూడాకాదు. ఈ తుంపరకోసం మహాసముద్రాన్ని వదులుకొంటున్నాము, తుంపరతో తాదాప్యం వలన మహా సముద్రాన్ని మిస్ అయిపోతున్నాము. మన హృదయంలో ఉన్న మహావెలుగు మనకు వ్యక్తం అవ్వటానికి ఎదురుచూస్తోంది కాని మనం ఈబుల్లి నేనులోనుండి, ఈ తుంపరలోనుండి బయట పడలేక పోతున్నాము. నీకు పూర్వపుణ్యం లేకపోతే, సత్పురుషులతో సహవాసం లేకపోతే ఇందులో నుండి బయటపడటం నీకు సాధ్యం కాదు.

నీ మనస్సు ఇలా తయారయ్యింది అంటే ఇప్పుడు నీ శరీరం పుట్టి 50 సం॥లు అయ్యింది అనుకో, ఈ 50 సం॥లలో ఇలా తయారవ్వలేదు. నీకు గతజన్మలు అనేకం వెళ్ళిపోయినాయి. నీ శరీరానికి 50 సం॥లు ఉండవచ్చుగాని నీజీవుడికి చాలా వయస్సు ఉంది. గత జన్మలలో పొందిన సంస్కారముల వలన నీ మనస్సు ఇలా ఉంది అని అర్థం చేసుకో. మీ ఇంట్లో ఒక్క పైసాకూడా లేదు అనుకోండి, ఆ పైసా దగ్గర నుండి సంపాదన మొదలు పెట్టాలి. అలాగే మీలో ఒక్క మంచిగుణం కూడా లేదు అనుకోండి జీరో పాయింట్ నుండే సాధన ప్రారంభించండి. మీలో ఒక్క దైవీగుణంకూడా లేదు అనుకోండి. ప్రయత్నం చేసి ఒకో గుణం సంపాదించుకోవాలిగాని నిరుత్సాహపడకూడదు. నీవు పోగొట్టుకోవలసింది పోగొట్టుకొంటూ ఉండు, సంపాదించవలసినవి సంపాదిస్తూ ఉండు. నీవు ప్రయాణం ప్రారంభించు, ప్రయత్నం ప్రారంభించు. నీ మనస్సును బాగు చేసుకో. నీవు అభివృద్ధిలోనికి రావటానికి ప్రయత్నించు. నీవు హృదయంలోనికి వెళ్ళేకొలది అనేక జన్మలను తీసుకొని వచ్చే సంస్కారముల నుండి విడుదలపొందుతున్నట్లు నీకు అర్థమవుతూ ఉంటుంది. ధ్యానం కళ్ళు మూసుకొని చేసుకోవాలా, కళ్ళు తెరిచి చేసుకోవాలా అని అడుగుతున్నారు. నీవు ఎలాగైనా చేసుకోవచ్చు. నీ మనస్సులోపలకు వెళుతోందా, లేదా అది చూసుకో. నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించి హృదయంలో లయం అవ్వాలి అది ముఖ్యం. గత జన్మలనుండి వచ్చిన వాసనలు తలంపులను కలుగజేస్తున్నాయి. అవి నీవు కాదుఅని అర్థం చేసుకొని వాటిలోనుండి విడదల పొందటానికి ప్రయత్నం చెయ్యి, వాటితో తాదాప్యం చెందవద్దు. మీలో ఏదైనా మంచి గుణం ఉంది అనుకోండి ద్వేషం ఉన్నవాడు ఆ మంచి గుణాన్ని చూడలేడు. ఎదుటివారిలో ఉన్న మంచి గుణాలను చూడలేకపోతున్నాం అంటే మనలో ద్వేషం ఉంది అని గుర్తు. చాలామంది వారి కంటిలో ఉన్న దూలాన్ని చూసుకోరు, ఎదుటి వారికంటిలో ఉన్న నలుసును చూస్తూ ఉంటారు. అంటువంటివారు మనకు కనబడితే ఉద్రేకపడకూడదు, వారి స్వభావం అంతే అని వదిలి వేయాలి ఎంతో సాధన చేస్తే కాని ఆస్వభావం పోదు. స్వభావం మార్చుకోవటానికి

ఒక్క సాధనే సరిపోదు, దైవానుగ్రహం ఉండాలి.

మీరు ధ్యానంలో అభివృద్ధిలోనికి వస్తున్నారు అనుకోండి మనస్సు సహజంగా బైట విషయాలను పట్టించుకోదు. ధ్యానం పటిష్టం అయ్యేకొలది మీకు లోకవాసన తగ్గిపోతుంది. ధ్యానబలం పెరుగుతూ ఉంటే మీకు లోచూపు కలుగుతుంది, శాంతి కలుగుతుంది, లోకం మిమ్మల్ని ఆందోళన పెట్టదు. ధ్యానబలం వలన నెమ్మదిగా విషయాలకు దూరమవుతాము, చైతన్యానికి దగ్గరవుతాము. ధ్యానం రకరకాలుగా చేస్తారు. హృదయం మీద మనస్సును నిలబెట్టి ధ్యానం చేయటంవలన చల్లగా ఉంటుంది, ప్రశాంతంగా ఉంటుంది, ధ్యానం తేలిక అవుతుంది. హృదయంకూడా ఒక ఉపాసన కేంద్రం. నీవు విచారణ చేసినా, ధ్యానం చేసినా, జపం చేసినా మనోమూలంలోనికి వెళ్లవలసిందే. మనో మూలంలోనికి వెళితేగాని చైతన్యం తాలూక సుఖం, శాంతి నీకు అందవు. నీవు ఏదో మార్గంలో ప్రయాణం చేసి హృదయంలోనికి వెళ్ళాలి. ఎప్పటికైనా అనుభవం అనేది హృదయంలోనే పొందాలి. కపటం ఉన్నవాడికి ఎంత సాధనచేసినా ఏమీ రాదు. కుండకు చిల్లులు ఉంటే దానిలో ఎంత నీరుపోసినా అది బయటకు పోతుంది అలాగే కపటం ఉన్నవాడు ఎంతసాధన చేసినా ఏమీ ప్రయోజనం లేదు. నీకు ఏదైనా చెడు తలంపులు వస్తూ ఉంటే మృదువుగా వాటిని తొలగించుకో. దేహప్రారబ్ధమును బట్టి ఒకోసారి చెడు సంఘటనలు వస్తూ ఉంటాయి, చెడ్డ మనుషులతో స్నేహం వస్తూ ఉంటుంది వాటినుండి మృదువుగా తప్పించుకో. ఈ రకంగా నెమ్మదిగా, ఆందోళన లేకుండా చేస్తూ వెళితే తొందరలోనే కృతార్థుడవుతావు. ఎవరైనా నీకు అపచారం చేసినా ఏదో వారు తెలియకచేసారు, వారుకూడా బాగుపడాలి, వారికికూడా జ్ఞానం రావాలి అనికోరుకో, అటువంటి పెద్దబుద్ధిని కలిగిఉండు అని పరమాత్మ చెపుతున్నాడు. అటువంటి బుద్ధి నీకు ఉంటే సరే లేకపోతే అటువంటి బుద్ధి నాకు లేదు అని కూర్చోవద్దు జీరోపాయింట్ నుండి సంపాదించటానికి ప్రయత్నించు. ఈ సృష్టిలో అన్నింటికంటే నీచమైనది భయం. కొంతమంది ప్రతీచిన్న విషయానికి భయపడతారు. భయపడటానికి ఈ సృష్టిలో ఏముంది? దేనినిచూసి భయపడతావు. మన ఆధ్యాత్మిక పురోభివృద్ధిని ఆటంకపరచేది భయమే. తరచుగా భయం వస్తూ ఉంటే దేహబుద్ధి పెరిగిపోతుంది. నీ స్వరూపానికి దూరమవుతావు. నీ శరీరం శవం అవ్వకముందే అంటే నీ ముక్కులో గాలి తిరుగుతున్నప్పుడే భయం నుండి బయటకురా అప్పుడు అభయస్థితి కలుగుతుంది.





# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-3-02, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహానికి అనారోగ్యం వస్తే కంగారుపడతాము, హాస్పటల్స్ చుట్టూ తిరుగుతాము కాని మనస్సులో చెడుతలంపులు వస్తే పట్టించుకోము. శరీరానికి వచ్చిన అనారోగ్యం కంటే మనస్సులో వచ్చిన చెడుతలంపులు ప్రమాదం. మనస్సులో వచ్చే ప్రతీ తలంపు యొక్క ప్రభావం దేహంమీద పడుతుంది. స్మశానంతో నశించిపోయే శరీరానికి ఇచ్చే విలువ మరణానంతరం మనకూడా వచ్చే మనస్సుకు ఇవ్వటం లేదు. దేహమే ఆత్మ అనుకొంటున్నాము, దేహమే సర్వస్వం అనుకొంటున్నాము, దేహము మరణించిన తరువాత జీవితం లేదు అనుకొంటున్నాము. ఇలా పరిమితమై జీవిస్తున్నాము. మనం చేసే పనుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. చేతితో మంచి పనులు చేయాలి. మనం మాట్లాడే మాట సౌమ్యంగా ఉండాలి, స్వీట్‌గా ఉండాలి, అది ఇతరులను వివేకవంతం చేయాలి. మనస్సులో వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీ దేహము, వాక్కు, మనస్సు ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలి, మోక్షం పొందటానికి వీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. సహృదయం ఉన్నవారిని ఉపయోగించుకొని నీవు బాగుపడటానికి ప్రయత్నించు. ధర్మం అంటే దానంకాదు. ధర్మం అంటే ఒక జీవిత విధానం. మన శరీరం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆపనిని సక్రమంగా చేయటమే, రాగద్వేషములు లేకుండా చేయటమే ధర్మం. ఏరకంగా జీవిస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుందో ఆరకంగా జీవించటమే ధర్మం. ఎవరో ఏదో చేసారు అని మనం చేయనక్కరలేదు. ఇది మంచి అనుకొన్నప్పుడు ఆపనిని చేయాలి. అలా చేయలేకపోతే నీకు పిరికితనం ఉన్నట్లు గుర్తు. ధర్మాన్ని ఆచరిస్తే, ఆప్రయత్నంలో నీశరీరం చనిపోయినా నీకు ఉత్తమస్థితి కలుగుతుంది. ఇతరులు మనపట్ల అధర్మంగా ఉన్నా మనం వారిపట్ల ధర్మంగానే ఉండాలి. ఎందుచేతనంటే భగవంతుడు చెప్పాడు కాబట్టి మనం ధర్మంగానే ఉండాలి. ఆయన అనుగ్రహం లేకుండా మనకు జ్ఞానం కలుగదు.

ఎక్కడో ఏదో ఉంది అని వేలాది జన్మలు పరుగులు పెట్టాము, తపస్సులు చేసాము. కాని ఎక్కడా ఏమీలేదు, ఉన్నది అంతా హృదయంలోనే ఉంది అది ఒక్కటే నిజం. Every thing is wrong, this is only right అని హృదయంలో ఉన్న వస్తువు తెలిసాక తెలిసింది అని చెపుతారు. ఎక్కడా ఏమీలేదు, ఉన్నట్లు నీకు అనిపిస్తోంది. ఉన్నది నీ హృదయంలోనే ఉంది. కాని దురదృష్టం ఏమిటి అంటే మహిమల మీద ఉన్న నమ్మకం మనకు హృదయంలో ఉన్న దేవుడి మీద లేదు. హృదయంలో భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు. దాని గురించి ఆలోచన ఎవరికి లేదు. ఇదేమాయ, కొబ్బరినూనె వ్రాస్తాము రోగాలు తగ్గుతాయి అంటే ఇది మతమా?

ఇది జ్ఞానమా? ఎక్కడికి మనిషిని తీసుకొని వెళుతున్నారు. ఒకవేళ రోగాలు తగ్గితే ఏమిటి? అసలు అజ్ఞానం నుండి ఎంతవరకు విడుదల అవుతున్నాము అనే గొడవలేదు. అజ్ఞానం నుండి విడుదల పొందటం ముఖ్యం. కేవలం చదువులవలన, పొడిపొడిమాటల వలన ఎవరికి జ్ఞానం రాదు. మనం ఏపనిచేస్తున్నా మన గమ్యం ఏమిటి అని correct understanding ఉండాలి. మన రోగానికి తగిన మందు అయితే అది వాడటం మొదలు పెట్టాక రోగం తగ్గటం మనకు తెలుస్తూ ఉంటుంది. అలాగే మన లోపల ఉన్న వస్తువును తెలుసుకోవటానికి సరిగ్గా ప్రయత్నం చేస్తూ ఉంటే, correct understanding ఉంటే దానిలోనే మీకు ఆనందం అందుతూ ఉంటుంది. పూర్తిగా వస్తువు మీకు అందకపోయినా ఆ అవగాహనలోనే మీకు ఆనందం అందుతూ ఉంటుంది. నడుస్తూ ఉంటే మనం నడుస్తున్నాము అని మనకు తెలుస్తుంది. మనస్సులో ఆందోళన ఉంటే ఆందోళన మనకు తెలుస్తూ ఉంటుంది. అలాగే మనకు జ్ఞానోదయం అయినప్పుడు జ్ఞానం గురించి మనకు తెలుస్తూ ఉంటుంది. హృదయగుహలోనికి వెళుతూ ఉంటే దాని తాలూక గుర్తులు మనకు తెలుస్తూ ఉంటాయి. మనం జపం చేస్తాము. ఆ నామం చేయటంవలన మనకు ఆనందం వస్తుంది. అది మంచిదే. కాని అది dependent happiness. ఆ నామం చేయటం వలన అది వస్తోంది లేకపోతే అది ఆగిపోవచ్చు. ఈ dependent happiness అంతా independent happinessగా మారితేగాని పునర్జన్మ నుండి, జననమరణ చక్రంనుండి విడుదల పొందలేవు.

ప్రపంచంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి, ప్రకృతి మారుతూ ఉంటుంది, దేహాలు మారుతూ ఉంటాయి. కాని మార్పులేనిది, పరిణామానికి అతీతమైనది నీ హృదయంలో ఉంది. జనన మరణాలు, ఈ సృష్టి యొక్క కథ అంతా హృదయంలోనే జరిగిపోతూ ఉంటుంది. మూలాలకు అన్నింటికి మూలమైన హృదయంలోనికి వెళితే ఏమీలేదు. అది ఒక్కటే నిజం ఇంక ఏమీలేదు అని నీకు తెలుస్తుంది. మనకు జయం వచ్చినప్పుడు గర్వం వస్తుంది, అపజయం వచ్చినప్పుడు బాధవస్తుంది. ఈగర్వం, బాధ నిన్ను హృదయంలోనికి వెళ్ళనివ్వవు. అందువలన వాటితో తాదాప్యం చెందకు. జయాపజయములను పట్టించుకోవద్దు, నీవు సమానంగా ఉండు. కులాలు, మతాలు మనుషలను విభజిస్తున్నాయి. చైతన్యం అఖండంగా ఉంది. అఖండమైన చైతన్యాన్ని దేహానికి, కులానికి, మతానికి పరిమితం చేస్తున్నావు. చైతన్యానికి హద్దులు కల్పించుకొంటున్నావు. కాని చైతన్యము సహజమైనది, నిర్మలమైనది, నిశ్చలమైనది, ఏమార్పు లేనిది. దేహమే చైతన్యం అని నీవు అనుకొంటున్నావు. ఆ తప్పడుతాదాప్యం వదులుకోవాలి. నీవు పూజచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా, సత్పురుషులతో సహవాసం చేసినా ఏది చేసినప్పటికి ఈ తప్పడుతాదాప్యం వదులుకోవాలి. ఆధ్యాత్మిక సాధనలో ప్రయాణం చేయటానికి ధైర్యం ఉండాలి, శాంత చిత్తం ఉండాలి. మనలను అందరూ వదిలేసినా మనం వంటరిగా,





స్వతంత్రంగా ఆబాటలో నడవగలగాలి. మీరు ఏమార్గంలో ప్రయాణం చేసినా శ్రద్ధముఖ్యం. శ్రద్ధలేకపోతే భక్తి రాదు, శ్రద్ధలేకపోతే ధర్మాన్ని ఆచరించలేరు, శ్రద్ధలేకపోతే జ్ఞానం రాదు.

నీ హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీ సర్వశక్తులు ఉపయోగించి ప్రయత్నం చెయ్యి. అలా ప్రయత్నం చేసినప్పుడు హృదయంలో స్థిరంగా ఉండిపోతావు. హృదయంలో నీవు స్థిరంగా నిలబడినప్పుడు దానికి మించిన ఆనందంలేదు అనే అనుభవం నీకు వస్తుంది. నీవు ఏదైనా పనిచేయాలంటే ఆపని వలన వచ్చే లాభం ఏమిటి అని ఆలోచిస్తావు. ఇలా ఆలోచించే నీవు జీవితంలో అనుభవించే భోగాలవలన నీకు వచ్చే లాభం ఏమిటి అని ఎందుకు ఆలోచించటంలేదు. ఒకసారి నిలబడి ఆలోచించు. ఇప్పుడు నీవు అనుభవించే భోగాలవలన పరిణామంలో రోగాలు వస్తాయి. నిజమైన ప్రవక్త ఏమిచేస్తాడు అంటే నిన్ను స్వేచ్ఛవైపుకు, ఆత్మజ్ఞానంవైపుకు నడిపిస్తాడు గాని వాడికి బానిసను చేయడు. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టండి. మీరు సత్యాన్వేషణలో ఉండండి. జ్ఞానం సముపార్జించే కొలది మీరు చేసే పని సక్రమంగా చేయగలరు. మీరు పనిని ఓర్పుగా, రాగద్వేషములు లేకుండా చేయగలిగితే మీరు ధ్యానం చేస్తే ఏ ఫలితం వస్తుందో ఇలా పనిచేయటం వలన కూడా అదే ఫలితం వస్తుంది. మీకు డబ్బు ఉంది, ఇంట్లో పరిస్థితులు అన్నీ బాగానే ఉన్నాయి అనుకోండి. మీకు దుఃఖం వస్తూ ఉంటే ఇవి అన్నీ ఏమి చేసుకొంటారు. శాంతి ఎక్కడ ఉంది అంటే నీ హృదయంలో ఉంది, ఇంట్లో పరిస్థితులలో లేదు. అందువలన హృదయంలోనికి చేరేవరకు ఏదో రకమైన దుఃఖం, అశాంతి నిన్ను వెంటాడుతూ ఉంటాయి.

నేను ఇతరులకు ఉపయోగపడతాను అంటున్నాడు. నేను ఇతరులకు ఉపయోగపడుతున్నాను అంటూ అజ్ఞానం పెంచుకొంటూ ఉంటే ఎందుకు అవి? ఇతరులకు ఉపయోగపడుతూ అజ్ఞానం పెంచుకొంటే ఏమిటి లాభం? ఇతరులకు ఉపయోగపడటం ద్వారా జ్ఞానం పెరగాలి. ఇతరులకు సహాయపడటం ద్వారా మనకు సత్వగుణం వస్తే మంచిదే. ఇతరులకు సహాయపడటంద్వారా రజోగుణం పెరగకూడదు. ఇతరులకు సహాయపడటం ద్వారా రజోగుణం పెరిగితే హృదయంలో ఉన్న సత్యానికి దూరమవుతావు. నీవు చేసేపని, ఉపకారములు ముఖ్యంకాదు. అవి చేసేటప్పుడు నీ భావన ముఖ్యం. పరిస్థితులు అర్థం చేసుకోండి. మనస్సు ఎలా ప్రయాణిస్తోందో చూసుకోండి. మనస్సు విషయంలో మెలుకువగా ఉండండి. మనం మంచిమాటను వినేటప్పుడు మన మనస్సు దానిని రిజెక్టు చేస్తుంది. పూర్వజన్మ సంస్కారం దానిని గెంటివేస్తుంది. ఈమాట కరెక్టుగానే ఉంది, రిజెక్టు చేయటం సంస్కారం చేసే పని అని గ్రహించి ఆమంచిమాటను మీగుండెకు హత్తుకునేలా చేసుకోగలిగితే ఆమాట మీ సంస్కారమును తగులబెడుతుంది. ఇతరులకు సహాయపడతాను అంటే సహాయపడటానికి ఇతరులు ఎక్కడ ఉన్నారు. చైతన్యంలో ఇతరులు లేరు. నీవు సహాయం

చేయటానికి నీకు భిన్నంగా ఎవరు ఉన్నారు. నేను సహాయం చేస్తాను అని చెప్పే ఆనేను ఎవరు? దానిని అర్థం చేసుకో. ఆనేనును చక్కబెట్టుకొంటే అన్ని సమస్యలు చక్కబడతాయి. అయితే ఆనేనును చక్కబెట్టుకొనే తీరికలేదు, బిజీగా ఉన్నాము అంటారు. అంటే చావటానికి బిజీగా ఉన్నారా? జ్ఞానం పొందటానికి బిజీగా ఉన్నారా? విషయం అర్థం చేసుకోండి. మీకు నేను సహాయపడుతున్నాను అనుకోండి. దానివలన మీకు వచ్చే లాభం ఏమీ ఉండదు. నాకు వచ్చే లాభం ఎక్కువ. నేను పవిత్రుడను అవుతాను. ఇది తెలిస్తే గర్వంరాదు. మీరు బంగారు వస్తువును అమ్మటానికి తీసుకొని వెళితే అది గొలుసా, అది గాజా అని వర్తకుడు చూడడు అందులో ఉన్న బంగారం క్వాలిటీ చూస్తాడు. అలాగే జ్ఞాని రూపం, నామం చూడడు. వాటికి ఆధారంగా ఉన్న చైతన్యాన్నే చూస్తాడు. వాడి దృష్టి అంతా చైతన్యం మీదే ఉంటుంది. మనం పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము ఇదే గొడవగాని మన మాట ఎలా ఉంది, మన ఆలోచన ఎలా ఉంది, మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని వాటి గురించి చూసేవాడు ఎవడైనా ఉన్నాడా? వాటిని ఎవరూ పట్టించుకోవటంలేదు. దేశంలో ఎక్కడైనా పొరపాటు జరిగితే అది నేను చేసాను అనేవారు గాంధీజీ. అంటే దేశంమీద, సమాజం మీద ఉన్న ప్రేమ అటువంటిది. ఆప్రేమ ప్రవాహంలో హృదయం విశాలమై మిధ్యానేను కొట్టుకొని పోతుంది. వారు ప్రత్యేకంగా కూర్చొని మనలాగ దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయనక్కరలేదు. ఉన్నదంతా చైతన్యమే. దానిని పొందు, అక్కడ నిలబడు, అక్కడ నుండి జారిపోకు. నీవునీవుగా ఉండు, అప్పడు నీద్వారా ప్రపంచానికి సహాయం అందుతుంది. నీకు అహంభావన ఉంటే ఊడగొట్టుకో, అందులో నుండి బయటకురా, అప్పడు నీద్వారా సమాజమునకు మహోన్నతమైన ఉపకారం అందుతుంది. దేహమునేను అనే సమస్యను పరిష్కారం చేసుకోగలిగితే చేసుకో. అది పరిష్కారం చేసుకోలేకపోతే భగవంతుడి మీద భారం వెయ్యి. భగవంతుడికి శరణాగతి చెందు ఆయనే పరిష్కారం చేసిపెడతాడు. ప్రారబ్దంననుసరించి మనలను ఈశ్వరుడు త్రిప్పతున్నాడు. దేహం ఎప్పడు, ఎక్కడ, ఎలా ఉండాలో అలా ఉంటుంది. ఎప్పడు చనిపోవాలో అప్పడు పోతుంది. ప్రారబ్దం ఖర్చు అయ్యేవరకు దేహం ఉంటుంది. ముక్కులోనుండి గాలి లోపలకు వెళ్ళేటప్పడు, గాలి బయటకు వచ్చేటప్పడు జ్ఞానసముపార్జన పట్ల ఆసక్తి పెంచుకోవాలి అనుకో. జ్ఞాన సముపార్జన చేయనప్పడు ఈగాలి నాకు ఎందుకు. జ్ఞానం సంపాదించాలి అనేభావనతో గాలి పీల్చుకో, గాలి వదిలిపెట్టు. ఈశ్వరుడిని హృదయపూర్వకంగా విశ్వసించినప్పడు నీవు దుఃఖ రహితుడవు, భయరహితుడవు అవుతావు. ఈశ్వరునిపట్ల పరిపూర్ణమైన విశ్వాసంతో ఉంటే రాగద్వేషములనుండి, భయంనుండి దుఃఖం నుండి నిన్ను విడుదల చేస్తాడు. అన్నీ ఈశ్వరుడికి తెలిసే జరుగుతున్నాయి అనే గమనికతో జీవించండి.

05-04-2002



## రమణభాస్కర

### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-3-02, నేరేడుమిల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఇల్లు కట్టాలంటే ఇటుకలు, సిమ్మెంటు, ఇసుక, కలప, ఇనుము ఇవి అన్నీ ఉండాలి. ఇవి అన్నీ ఉన్నా ఇల్లు కట్టాలనే సంకల్పం లోపలనుండి వస్తే ఆపని పూర్తి అవుతుంది. ఆధ్యాత్మిక విషయంకూడా అంతే. జ్ఞాన సముపార్జనకు కూడా ఎక్విప్‌మెంట్ అవసరం. ఇల్లు కట్టటానికి ఇటుకలు, సిమ్మెంటు, కలప అవి ఎలా సంపాదించుకొంటామో అలాగే జ్ఞాన సముపార్జనకు సత్వగుణం, సహనం, వినయం సంపాదించుకోవాలి. ఇవి అన్నీ సంపాదించుకొంటే సరిపోదు, చైతన్యానుభవం పొందాలి అనే కాంక్ష లోపలనుండి ఉబికి, ఉబికి రావాలి. అప్పడు ప్రయత్నం చేసి చైతన్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటాము. చైతన్యం యొక్క స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం. అజ్ఞానంతోటి, చావుపుట్టుకలతోటి దానికి సంబంధంలేదు. అజ్ఞానానికి సంబంధించిన ఆటవిక మనస్తత్వం దానికి లేదు. ఎంతోమంది మహనీయులు వారు ఏస్థితిని పొందారో ఆ స్థితి మనచేత పొందింపచేయటానికి మనకోసం తపించి మనకు బోధించారు. మనపట్ల ప్రేమలేకపోతే ఆభోదను బోధించలేరు, టీచింగ్‌తోపాటు వారి అనుగ్రహాన్ని కూడా మనకు ప్రసాదించారు. ఏమి పునాది లేకుండా నాలుగు అంతస్థుల భవనం కట్టేస్తాము అంటే కుదరదు అలాగే ఆహారం, మాటలు, నిద్ర విషయంలో జాగ్రత్త లేకుండా మేము జ్ఞానం సంపాదిస్తాము అంటే ఆ మాటలకు అర్థం లేదు. ఈ మూడింటి విషయంలో తగుమాత్రంగా ఉండాలి. ప్రయాణాలలో తక్కువ లగేజి ఉంటే ప్రయాణం సుఖంగా సాగుతుంది. అదేవిధంగా స్నేహాల విషయంలో, వ్యవహారాల విషయంలో తగుమాత్రంగా ఉండు. అతిగా ఇతరుల వ్యవహారాలలో కలుగజేసుకోవటం వలన లగేజి పెరుగుతుంది, నిష్ఠూరాలు మిగులుతాయి. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనేవారు వారిపని వారు చేసుకోవచ్చు, ఇతరులకు సహాయం చేయవచ్చుకాని ఇతరుల విషయాలలో అతిగా కలుగజేసుకొంటే ఇబ్బందులు వస్తాయి, మీ పురోగతి ఆగిపోతుంది.

మనం ఏకాంతంగా ఉన్నప్పడు మనస్సును పరిశీలించుకొంటూ ఉండాలి. మీ గురించి మీకు సరియైన అవగాహన ఉండాలి. మనకు ఏ తలంపువస్తే అదే నిజం అనిపిస్తుంది. పూర్వజన్మ సంస్కారమునుండి తలంపు పుడుతుంది, ఆతలంపునుండి కోరిక వస్తుంది. అప్పడు అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తుంది. ఇది ఏదీ నిజంకాదు. అందువలన మనం

భగవంతుని పాదాలను ఆశ్రయించి, ఆయన చెప్పిన మాటలను గుర్తుపెట్టుకొని, ఇదంతా వాసన చేసే పని అని గ్రహించి, ప్రయత్నం చేసి గురువు అనుగ్రహంవలన ఆ వాసనలో నుండి విడుదల పొందాలి అనేటటువంటి సంకల్పంతో మనం పనిచేయాలి. అప్పుడు వాటిలోనుండి విడుదల పొందుతావు. మన తల్లితండ్రులు మనకు మంచి చెపుతారుకాని చెడ్డచెప్పరు. అలాగే జీవకోటికి తండ్రి అయిన ఈశ్వరుడు మనకు మంచే చెపుతాడు గాని చెడ్డ చెప్పడు. కాని ఆయన చెప్పినది మంచి అని మనం గుర్తించటంలేదు, మన వాసనలు భగవంతుడు చెప్పిన మాటలను గుర్తించనివ్వటంలేదు. ఆయన దయ లేకుండా ఆయన పాదాల దగ్గరకు మనం చేరలేము. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని మనం జీవించాలి. ఎవడైతే అజ్ఞానం అనే అడవిలో నుండి విడుదల పొందాడో వాడి మాటలకు మనం గౌరవం ఇవ్వాలి. అజ్ఞానంలో ఉన్న వాడి మాటలను మనం పట్టించుకోనవసరం లేదు. మనకు శివుడు కనిపిస్తాడు అనుకోండి. చూచేవాడు ఎంతనిజమో మనకు కనిపించే ఆశివుడు కూడా అంతే నిజం. ఇది వ్యవహారిక సత్యమే గాని పారమార్థికసత్యం కాదు. వీటి అన్నింటికి అతీతంగా నిజమైన శివుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆ హృదయంలో ఉన్న శివుడిని పొందినప్పుడు అది నీకడసారి జన్మ. అప్పుడు అజ్ఞానంతో, దుఃఖంతో ఉన్న సంబంధం పూర్తిగా తెగిపోతుంది. ఇంట్లో పెళ్ళి జరుగుతోంది అనుకోండి. అనేక చోట్లకు వెళతాము, అనేక వస్తువులు కొంటాము. వచ్చిన చుట్టాలను గౌరవించకపోతే వారికికోపం. ఇలా పెళ్ళికి ముందు, తరువాత అనేక రకాల గొడవలు అంతా బాడిచేసుకొంటాము. అలాగే ఇంట్లో ఎవరైనా మరణించినా అంతా గొడవే. చాలామంది ఇంటికి రావటం, పలకరించటం, బాగుండదని వీరు ఏడవటం ఇలా చాలా గొడవగా ఉంటుంది. ఇవేకాకుండా సంసారంలో అనేక పేచీలు. ఒకరికి ఒకరికి పడదు, ఒకరు చెప్పినది ఇంకొకరికి అర్థంకాదు. ఇలా రకరకాల బాధలు పడుతున్నాము. సంసారంలో పడే బాధలలో 10వ వంతు ఆత్మజ్ఞానం కోసంపడితే అంటే ఆత్మజ్ఞానం కోసం కృషిచేసి అవసరం అయితే దానికోసం బాధపడితే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

ఏదైతే నీవు అనుకొంటున్నావో అది నీవుకాదు. నీవుకాని దానితో తాదాప్యం పొందుతున్నావు. నిన్ను నీవు తెలుసుకోవాలి అని ఎందుకు చెపుతున్నాను అంటే నిన్ను నీవు తెలుసుకొంటే నీవు దేవుడిని తెలుసుకొన్నట్లే, దేవుడికి భిన్నంగా నీవు లేవు. నిన్ను నీవు తెలుసుకోకుండా దేవుడిని చూసాను అంటే నీ కళ్ళతో చూసేవాడు ఎంత నిజమో నీకు కనిపించేదేవుడు కూడా అంతే నిజం. నీకళ్ళతో చూసే దేవుడి వలన నీవు పునర్జన్మనుండి,





అజ్ఞానం నుండి బయటకు రాలేవు. భగవంతుడికి అసాధ్యం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. ఆయన సర్వస్వతంత్రుడు. ఆయన స్వరూపం మనకు వ్యక్తమయ్యేవరకు స్వతంత్రమైన సుఖంగాని, స్వతంత్రమైన ఆనందంగాని మనకు లేనేలేవు. నీవు ఏదైనా మంచి పనిచేసినా నిర్మలమైన బుద్ధితోచెయ్యి, సత్వగుణంతో చెయ్యి. కుడిచెయ్యి చేసేపని ఎడమచేతికి తెలియకుండా చెయ్యి. చేసేపని నిర్మలంగా చెయ్యి, నిరాడంబరంగా చెయ్యి. అలాకాకుండా ఆడంబరం కోసం పనిచేస్తే సమాజంలో గౌరవం రావచ్చుగాని లోపల కుళ్ళిపోతావు. మీరుచేసే పని వలన రజోగుణం పెరిగితే రజోగుణం రాబోయే జన్మలలో చెడ్డ చేస్తుంది. మనం ఎక్కడికి వెళ్ళినా వచ్చిన పనిచేసుకొని వెళ్ళాలి. అంతకంటే ఎక్కువగా వ్యవహరిస్తే లోకవాసన పెరిగిపోతుంది. ఎవరో మనలను బంధించటం లేదు. మన వాసనలు, మన మాటలు, మన కోరికలు మనలను బంధిస్తున్నాయి. ఈశ్వరుని మాటయందు గౌరవంలేకుండా ఈశ్వరుని దయ లేకుండా అజ్ఞానంలోనుండి, బంధంలోనుండి మనం విడుదల పొందలేము. బంధం అంటే ఏమీలేదు లోకంపట్ల మనకు ఉన్న భ్రాంతే బంధం. భ్రాంతి పోయింది అనుకోండి బంధం నుండి బయటకు వచ్చేస్తాము. అయితే మాటలు చెప్పటం తేలికగాని ఈశ్వరునికరుణ లేకుండా భ్రాంతిలోనుండి విడుదల పొందటం సాధ్యం కాదు. అందువలన ఈశ్వరుని పాదాలయందు భక్తిని విడిచిపెట్టవద్దు. నీ మనస్సుకు ఆధారంగా ఉన్న వస్తువును నీవు చూడటంలేదు. మనస్సు కల్పించే విషయాలు చూస్తున్నావు. మనస్సు ఎక్కడ ఉదయిస్తోంది, దానికి ఆధారం ఏమిటి అని అక్కడ గురిపెట్టటం లేదు. నీలోపల భగవంతుడు ఉన్నాడు. నిన్ను నీవు తెలుసుకొంటే భగవంతుడు నీకు తెలుస్తాడు.

నా హృదయంలో భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు. నిజంగా ఉంటే నాకు కనబడాలి కదా. మీరు ఉన్నాడు అని చెపుతున్నారు. మీ నమ్మకాల మీద మేము ఎక్కడ ఆధారపడతాము, అనుకోవటాలు అంటే మాకు కుదరదు అని అడుగుతున్నాడు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే ఉన్నాడు, ఉన్నాడు అనుకొన్నవాడు లేకుండా పోలేదు ఉన్నాడు. నీకు తెలిసినా తెలియకపోయినా వాడు ఉన్నాడు. వాడు నీకు తెలియకపోవటానికి 1. నీ బుద్ధిలో ఉన్న వంకరలు కారణం, 2. వాండరింగ్ మైండ్ కారణం. బయట ఉన్న చీకటిని పోగొట్టటానికి అనేక ఉపాయములు ఉన్నాయి. ట్యూబులైటు పెట్టుకొంటాము, కరెంటు లేకపోతే కిరోసిన్ దీపంగాని, కొవ్వొత్తిగాని వెలిగించుకొంటాము. కాని లోపల ఉన్న చీకటి అంత తేలికగాపోదు. గురువు అనుగ్రహం లేకుండా మన తెలివి తేటల వలన లోపల ఉన్న చీకటిపోదు. ఈశ్వరుని కరుణ ఉంటే మన మొఖంలో కాంతి, శాంతి, ప్రేమ తాండవిస్తుంది. నీ బుద్ధిలో ఉన్న వంకరలు

తగ్గించుకో, నీ బుద్ధిని నిదానంగా ఉంచు. నీ మనస్సులో ఉన్న చాపల్యం తగ్గించుకో. నీవు సాధన చేయటం వాటికోసమే. వాటిని తగ్గించుకొన్న తరువాత ఈశ్వరుడు కనబడకపోతే అడుగు. సాధన ప్రారంభించినప్పుడు భగవంతుడు వేరు, మనం వేరు అని ప్రారంభిస్తాము. సాధన ముగింపులో ఆయనే నేను, నేనే ఆయన రెండు లేవు అని తెలుస్తుంది. సాధన చేసేటప్పుడు రెండు, సాధన పూర్తి అయ్యాక ఒక్కటే. నీ బుద్ధిలో వంకర్లు పోగొట్టుకో, మనస్సు యొక్క చాపల్యం తగ్గించుకో అని చెపుతున్నారు. నా హృదయంలో దేవుడు ఉన్నాడు కదా. ఆయన శక్తి లేకుండా ఉండడు. ఆశక్తిని ఉపయోగించి నా మనస్సుయొక్క చాపల్యం ఎందుకు తొలగించకూడదు, నాబుద్ధిలో ఉన్న వంకరలు ఎందుకు తొలగించకూడదు అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు బాగానే చెప్పావు. నీ బుద్ధిలో ఉన్న వంకరలు పోగొట్టకపోతే వాడు దేవుడు ఏమిటి? ఆయన చెయ్యాలి అంటున్నావు తప్పకుండా చేస్తాడు. అయితే భగవంతుడు నావాసనలు తొలగించాలి, నాబుద్ధిలో ఉన్న వంకరలు తొలగించాలి, నా మనస్సు యొక్క చాపల్యం తొలగించాలి అనేటువంటి తపన, కాంక్ష నీకు ఉంటే ఆయన తప్పక తొలగిస్తాడు. భగవంతుడి సహాయాన్ని నీవు హృదయపూర్వకంగా కోరుతూ ఉంటే సహాయం రాకుండా ఎలా ఉంటుంది. ఆయన సహాయం చేస్తాడు నీ బుద్ధిలో ఉన్న వంకరలు, నీ మనస్సు యొక్క చాపల్యం తొలగిస్తాడు. నీ తపన నిజమైతే ఎంత వేగంగా వస్తాడు అంటే గజేంద్రమోక్షంలో నారాయణుడు వచ్చినంత వేగంగా వస్తాడు. నీ శరణాగతి నిజమైతే అంత వేగంగా వచ్చి నీ వాసనలను బయటకులాగి కాల్చిబూడిద చేసి నిన్ను విడుదల చేస్తాడు. ఈశ్వరుడి శక్తిని అనుమానించకు. ఈశ్వరుడు ఆపని చేయగలడు అనే నమ్మకం నీకు పూర్ణంగా ఉండాలి. ఈశ్వరుడు శక్తివంతుడు అని నీవు నోటితో చెపుతున్నావు కదా అది హృదయపూర్వకంగా నమ్మితే, ఆ విశ్వాసం నీకు ఉంటే ఆయనే అన్ని పనులు చేస్తాడు అని చెప్పారు. నీ నోటితో చెప్పే మాట నిజమైతే, నీ విశ్వాసం నిజమైతే అంటున్నారు ఆ విశ్వాసం నిజమయ్యేలాగ ఆయనే చూసుకోవచ్చుకదా అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే విశ్వాసం కూడా ఆయనే కలుగజేసుకొంటాడు అసలు ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడుఅని నీవు నమ్మగలిగితే, హృదయపూర్వకంగా నమ్మితేచాలు నామాటలు నీవు నమ్మనక్కరలేదు అంటున్నారు. నమ్మకానికి మించిన ప్రార్థన లేదు, పూజలేదు. నమ్మకం నిజమైతే అన్నీ ఆయనే చూసుకొంటాడు. వంటచేయటమే కాదు, వడ్డించటమే కాదు, నోట్లో పెట్టటమేకాదు, నీచేత తినిపించటం కూడా ఆయనే చేస్తాడు. నీకు ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే అలావెళ్ళు నీకోరికలు నెరవేరతాయి, అజ్ఞానం నుండి బయటకు వచ్చేస్తావు అంటున్నారు భగవాన్. ఒకవేళ నమ్మకం కుదరటంలేదు అనుకో, ఈ దొంగనేనుకు విశ్వాసం కుదరటం లేదు అనుకో ఈ దొంగనేను ఎవరు అని విచారణ చేసి దానిని తొలగించుకో. నమ్మకం ఉన్నవాడికి ఆశాభంగం ఉండదు, ఏదైనా ఆయన ప్రసాదమే అంటాడు. మంచి జరిగినప్పుడు దేవునిదయ అనుకొన్నప్పుడు చెడు జరిగినా ఆయన దయే అనుకో. అప్పుడు మనస్సు చల్లబడుతుంది. మీరు చెప్పినది అంతా బాగానే ఉంది, మేము ప్రపంచ మనుషులం, ఇంకా ప్రపంచవాసన పోలేదు. మేము దేవునికి దగ్గరగా లేము ప్రపంచానికి దగ్గరగా ఉన్నాము, మాకు అన్నీ కావాలి వాటితోపాటు మోక్షం కావాలి గొడవలు వదిలించుకోవాలి అనుకొంటున్నాము కాని వదిలించుకోలేక పోతున్నాము. ఏదో దుఃఖం వెంటపడుతోంది. భగవంతుని ప్రార్థిస్తున్నాము కాని తృప్తి అవ్వటంలేదు. మీరు చెప్పినంత విశ్వాసం లేకపోయినా బొత్తిగా విశ్వాసం లేని వారము కాదు. నా మానసిక పరిస్థితి ఇది ఏమి చేయమంటారు అని అడుగుతున్నాడు. నీకు ఉన్న నమ్మకాన్ని పూర్ణం చేసుకో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి అంటున్నారు భగవాన్. నీకు ఒక శాతం నమ్మకం ఉంది అంటున్నావు దానిని సెంట్ పర్సంట్ చేసుకో అంటున్నారు భగవాన్. మీరు చెప్పినట్లుగా సెంట్‌పర్సంట్ నమ్ముతాను అనుకోండి ఆయన సహాయం చేయటం మానివేస్తాడేమో అప్పుడు మాట ఏమిటి అంటున్నాడు. నీ నమ్మకం నిజమైతే, పూర్ణం అయితే సహాయం చేస్తాడు, చేయడు అనే తలంపు కూడా నీకు రాదు.

నీకు కష్టాలు వస్తే కంగారు పడకు. నీకు కొద్దిగానే విశ్వాసం ఉంది అంటున్నావు కదా. నీకు పూర్ణ విశ్వాసం కలుగజేయటానికి కొన్ని కష్టాలు పంపుతాడు. నీకు ఏది ఇష్టమో అది భగవంతుడు చేయలేదు అని బాధపడవద్దు. నీకు ఇష్టమైనది చేస్తాడు అనుకో గర్వం వచ్చి ఒకోసారి నీవు పాడైపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి ఆపుచేసినా తరువాత చేస్తాడు. నీకు ఏది మంచిదో నీకంటే దేవుడికి ఎక్కువ తెలుసు. ఇది మాటకాదు ఇది మంత్రం. ఈ విషయం అర్థమయితే నీకు ఆందోళన ఆగిపోతుంది, దుఃఖం చల్లారిపోతుంది. నీకు ఇష్టంలేని సంఘటనలు పంపినా భగవంతుడు ఇలా ఎందుకు చేస్తున్నాడు అనుకోకు. నీలోపల సౌందర్యం పెంచటానికి, నిన్ను మహోన్నతుడిని చేయటానికి, నీ జ్ఞానం పూర్ణం చేయటానికి ఈశ్వరుడు అలా చేస్తున్నాడు. అంతేగాని నీ మీద ప్రేమలేకకాదు. అందువలన ఇష్టంలేని సంఘటనలు జరిగినా ఈశ్వరునిమీద విశ్వాసం విడిచిపెట్టవద్దు.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 06-04-2002 నుండి 10-04-2002 | | నాగపూర్ క్యాంపు |
| 11-04-2002 | గురువారం | సామర్లకోట, విమల్ బాటిలింగ్ కంపెనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ |
| 13-04-2002 | శనివారం | భీమవరం, అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపం |
| 16-04-2002 | మంగళవారం | భీమవరం, తాడిమళ్ళ, జగన్నాధశర్మ గారి కళ్యాణ మండపం |
| 17-04-2002 | బుధవారం | సఖినేటిపల్లి, గీతామందిరం |
| 19-04-2002 | శుక్రవారం | రావులపాలెం |
| 21-04-2002 | ఆదివారం | పాలకోడేరు రామాలయం, శ్రీరామనవమి మహోత్సవం |
| 30-04-2002 | మంగళవారం | గరగపర్రు |

## తణుకులో క్షత్రియ కళ్యాణమండప శంఖుస్థాపన మహోత్సవం



గోటేరు వా॥లు శ్రీ పెన్మెత్స రామభద్రరాజుగారి కుమారులు వెంకటపతి రాజుగారు మరియు వారి సోదరులు కలసి ఇచ్చిన 1600 చ॥గ॥ స్థలములో తణుకు క్షత్రియ సంక్షేమ సేవా సమాఖ్య వారి ఆధ్వర్యంలో నిర్మించబోతున్న క్షత్రియ కళ్యాణ మండపమునకు ది. 31-3-2002 ఆదివారం ఉదయం గం॥ 10-31 ని॥లకు సద్గురు శ్రీ నాన్నగారు శంఖుస్థాపన చేసినారు. ఈకార్యక్రమమునకు క్షత్రియ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు శ్రీ భూపతిరాజు వరాహనర్సింహరాజు మరియు అనేక మంది క్షత్రియ ప్రముఖులు విచ్చేసి శంఖుస్థాపన మహోత్సవమును జయప్రదం చేసినారు. ఈ కళ్యాణ మండపము నిర్మించుటకు సద్గురు శ్రీ నాన్నగారు ఆశీస్సులతోపాటు రు॥ 50,000/-లు విరాళముగా ఇచ్చినారు.

### గమనిక

సామర్లకోట, భీమవరంలలో జరగవలసిన సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ ప్రవచనములు తేదీలు మారినవి. గమనించగలరు.

## విద్యాలయం దేవాలయం కన్నా మిన్న



పాలకొల్లు 13వ వార్డు సరస్వతి నగర్‌లో సరస్వతి శిశుమందిర్ శంకుస్థాపన సమావేశంలో సద్గురు శ్రీ నాన్నగారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. విద్యాలయాలు దేవాలయం కన్నా మిన్న అని, హిందువులు దేవాలయాలకు ఎక్కువ సొమ్ము వెచ్చిస్తున్నారని, విద్యాదానం భూదానం ద్వారానే ఎక్కువ ముక్తివస్తుందని ఋషులు పేర్కొన్నారని సద్గురు నాన్నగారు అన్నారు. భారతదేశంలో హిందువులు మైనార్టీల కన్న హీనంగా బతుకుతున్నారని, మైనార్టీలు తప్పచేసినా, ఒప్పచేసినా అటు ప్రభుత్వం, ఇటు పత్రికలు పట్టించుకోవడంలేదని, హిందువులు ఏదైనా చిన్న పనిచేస్తే పెద్ద రగడ చేస్తున్నారని, తప్ప ఎవరు చేసిన ఎత్తిచూపే పద్ధతిని అలవరచుకోవాలని ఆయన కోరారు. ఎవరినైనా గౌరవించే సహనం సంస్కృతి హిందువులకే ఉందని ఆయన తెలిపారు. హిందూదేశంలో హిందువులు స్వేచ్ఛగా బతికే వాతావరణాన్ని కలగజేయాలని ఆయన కోరారు. ఈ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ వల్లే హిందువులకు రక్షణ ఇంకా మిగిలి ఉందని ఆయన తెలిపారు. సరస్వతీ శిశు మందిర్‌లో ఆచార్యులు తక్కువ వేతనంతో సమాజ అవసరాలకు ఉపయోగపడే విద్యను అందిస్తున్నారని, ఈ పాఠశాలల్లో విద్యార్థులు, విద్యలోను, క్రమశిక్షణలోనూ, ఆటలలోనూ, పాటలలోనూ మిగిలిన పాఠశాలలకు గట్టి పోటీ ఇస్తున్నారని, ఇటువంటి విద్యార్థులను తయారుచేసే ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా కనిపించే యోగులుగా ఆయన అభివర్ణించారు. స్థలదాత జైషుక్‌లాల్ జె. మెహతా దంపతులు రు॥ 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సరస్వతి శిశుమందిర్ భవనానికి సద్గురు శ్రీ నాన్నగారుశంఖుస్థాపన చేసారు.